



# భస్మాసుర 'హస్తం'

- వ్యవసాయరంగాన్ని ఆగం చేసే కుట్రలు
- నాడు విద్యుత్ లేక అన్నదాతలు అవస్థలు
- ఇప్పుడు మళ్లీ 3 గంటల కరెంట్ చాలంటూ బూటకం
- కాంగ్రెస్ నాయకులకు పుట్టగతులుండవని హెచ్చరిక
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జిల్లా రైతులు

**దేశంలో ఎక్కడా లేని విధంగా** వ్యవసాయానికి బీఆర్ఎస్ సర్కారు అందిస్తున్న 24 గంటల సరఫరాను చూసి కాంగ్రెస్ ఓర్వలేకపోతున్నది. రైతులు సుభిక్షంగా ఉండటాన్ని తట్టుకోలేకపోతున్నది. అందుకే రైతులకు 3 గంటల కరెంట్ చాలని ఆ పార్టీ నేతలు అడ్డగోలుగా వాగుతున్నారు. అంతటితో ఆగకుండా రైతులు 10హెచ్‌పీ మోటర్లు కొనుక్కుంటే సరిపోతుందని ఉచిత సలహాలు ఇస్తున్నారు. దీనిపై జిల్లా రైతులు అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. సంతోషంగా ఉన్న అన్నదాతను ఆగం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, 3 గంటల కరెంట్‌తో మూల కూడా తడవదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల నాశనం కోరుకునే కాంగ్రెస్‌కు పుట్టగతులుండవని, ఓట్ల కోసం వస్తే ఉరికించి కొడతామని దుమ్మెత్తిపోస్తున్నారు.

– సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నవంబర్ 25



## మూడు గంటలతో ఓ మూల పారదు

ఎవుసానికి మూడు గంటల కరెంట్ ఇస్తే ఓ మూల కూడా పారదు. గట్ల చెప్పితే రేపురేపు ఎవుసం బంద్ చేసుకోవాల్సి వస్తుంది. ఇప్పుడు 24 గంటల కరెంట్ వస్తుంది. రైతులకు చాలా మేలు జరుగుతుంది. కరెంట్ ఎప్పుడొస్తదో, ఎప్పుడు పోతదో అన్న రందీ లేదు. 24 గంటల కరెంట్ వల్ల పదేండ్ల కింద అద్దెకరం పొలం పారితే ఇప్పుడు ఆరు ఎకరాల పొలం పారుతుంది. తొమ్మిదేండ్ల నుంచి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎవుసం చేసుకుంటున్నాం. మూడు గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ పార్టీ మాకొద్దు, రైతుల కష్టాలు తీర్చుతున్న సీఎం కేసీఆర్‌కే మా రైతులమంతా మద్దతు ఇస్తాం.

–బెల్లి వెంకటయ్య, కౌలు రైతు, మద్దూరు

## ఎవుసం తెల్వనోడు ఏదైనా చెప్తడు



సిద్దిపేట అర్బన్, నవంబర్ 25: నాకు ఐదు ఎకరాల పొలం ఉంది. ఎవుసం తెల్వనోడు ఏదైనా చెప్తడు. 10 హెచ్‌పీ మోటర్ నేను సూడంగ ఎవరూ పెట్టుకోలే. ఎక్కువశాతం మంది ఏడు హెచ్‌పీ పెట్టుకుంటరు. గంత పెద్ద మోటర్లు పెట్టుకుంటే ట్రాన్స్‌ఫార్మర్లు ఆగయి. మా పొలం పక్కకే వాగు ఉంది. యాసంగిలో కూడా మాకు నీళ్లు వస్తున్నాయి. మళ్లీ గత రోజులను మేము కోరుకుంటలేము. బీఆర్ఎస్ ప్రభుత్వమే 24 గంటల విద్యుత్ సరఫరా చేయిస్తున్నది.

– సంద సంతోష్, రైతు, అక్కెనపల్లి, నంగునూరు మండలం



## ఒక్క మడి పారదు

కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లు మూడు గంటల కరెంట్ ఇస్తే వ్యవసాయం మూలకు పడ్డట్టే. మూడు గంటల కరెంట్‌కు ఒక ముందటి మడి కూడా తడవదు. వ్యవసాయం గురించి తెల్వని కాంగ్రెస్ నాయకులు రైతులకు తెలిసీ తెల్వని మాటలు చెబుతు న్నారు. ఇప్పుడు ఏ ఊరికి వెళ్లినా పుష్కలమైన నీళ్లు, 24 గంటల ఉచిత నాణ్యమైన కరెంట్ సరఫరా చేయిస్తున్నారు. దీంతో కావాల్సిన పంటలు పండిస్తున్నారు. కాంగ్రెస్ నాయకులకు అధికారం తప్పా రైతుల మంచి చెడు గురించి అవసరం లేదు.

– ఐలవ్వ, మహిళా రైతు, దుద్దెడ, కొండపాక మండలం

## కాలిన మోటర్ల సంఖ్య తగ్గింది



వర్గల్, నవంబర్ 25: కేసీఆర్ ప్రభుత్వం రాకముందు ఇట్లకరెంట్ లేకుండే. 25 ఏండ్ల నుంచి మోటర్ మెకానిక్‌గా పనిచేస్తున్నా. పదేండ్ల కింద రోజుకు రెండు,మూడు కాలిపోయిన మోటర్లు వచ్చేవి. నాతోపాటు ఒక జీతగాడు ఉన్నాడు. పొద్దంతా పని ఉండేది. మోటర్ల మరమ్మతులతో తిందామంటే కూడా తీరిక ఉండేదికాదు. మోటర్ వెండింగ్‌తో పొద్దు,జాము తెలియలేదు. డిమ్ముకరెంట్‌తో మోటర్లు కాలిపోయ్యేది. ఒక్కోసారి ఒక రైతు నెలలో రెండు సార్లు మోటర్ కాలిపోయిందని తెస్తుండే. ఇప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం కరెంట్‌తో రైతులకు న్యాయం జరిగింది. రైతుల మోటర్లు,స్టార్టర్లు కాలిపోవడం లేదు. కాంగ్రెస్ పాలన వద్దేవద్దు.

–కూచారం యాదగిరి, మోటర్ మెకానిక్, నాచారం, వర్గల్ మండలం

## 10హెచ్‌పీ మోటర్‌తో వ్యవసాయం ఎట్ల చేస్తరు



హుస్నాబాద్‌రూరల్, నవంబర్ 25: 10హెచ్‌పీ మోటర్లు పెట్టి వ్యవసాయం చేయాలి అని కాంగ్రెసోళ్లు అంటున్నరు. వాళ్లకు ఏమైనా వ్యవసాయం గురించి అసలు తెలుసా? మన తెలంగాణలో 10హెచ్‌పీ మోటర్లు గుంజేంత నీళ్లు బోర్లలో ఉండవు. లోఓల్టేజీ సమస్యతో మోటర్లు వారం తిరగక ముందే కాలిపోయేవి. మోటర్లు రిపేర్ చేయించుకు నేందుకు రైతులు మా దుకాణాల వద్ద పడిగాపులు పడేటోళ్లు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మోటర్లు కాలిపోయాయని మా దుకాణం దగ్గరకు తీసుకువచ్చేటోళ్లే తగ్గారు. 24గంటల కరెంట్‌తో రైతులు వ్యవసాయం పండుగలాగా చేసుకుంటున్నారు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 3గంటలు విద్యుత్ ఇస్తామని అంటున్నరు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు ఇబ్బందులు తప్పవు. 10హెచ్‌పీ మోటర్లతో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉంది.

– పోగుల సత్యం, మోటర్ మెకానిక్, తోటపల్లి, హుస్నాబాద్ మండలం

## రైతులకు నష్టం



దుబ్బాక టౌన్, నవంబర్25: మూడు గంటల కరెంట్ ఇస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారు. మూడు గంటల్లో ఎకరం భూమి ఎట్ల తడుస్తదని కాంగ్రెసోళ్లు అనుకుంటున్నారు ? ఎకరం భూమి తడపాలంటే 5 హెచ్‌పీ మోటర్‌తో ఐదు గంటలు పడుతుంది. మూడు గంటల కరెంట్ ఇస్తే ఒకే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ల మీద లోడుపడి కాలిపోతాయి. అప్పుడు కూడా రైతులకు ఇబ్బందులే. ఇక 10 హెచ్‌పీ మోటర్లు అంటున్నారు వీటితో కూడా రైతులకు ఏ మాత్రం లాభం కాదుకదా బాగా నష్టపోతారు. కాంగ్రెసోళ్లు కరెంట్ మీద అవగాహన లేక మాట్లాడుతున్నారు. మూడు గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటర్లు రైతులకు తీవ్ర నష్టం చేసేనట్లే. బీఆర్ఎస్ ప్రభుత్వమే కరెంట్ కష్టాలు లేకుండా చేసింది. రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. కాంగ్రెసోళ్ల మాటలు వింటే పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి. ఏదిఏమైనా కేసీఆర్ సారే మళ్లీ రావాలి. రైతుల కష్టాలు తీరాలి.

– మల్లేశం, రైతు, దుబ్బాక టౌన్

## అప్పుడు కరెంట్ కోసం పడిగాపులు



కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎప్పుడు కరెంట్ వస్తదో..ఎప్పుడు పోతదో తెల్వకుండేది. బాయిల కాడికి సద్దితీసుకుపోయి పడిగాపులు కాసేటోళ్లం. బావుల దగ్గర విషపురుగులు కాటేసేది. వచ్చిన కరెంట్ ఊకే ఊకే పోయ్యేది. ఒక్క దొయ్య పండాలన్నా చాలా కష్టాలు పడేది. అప్పటి దినాలు యాదికొస్తే దుఃఖం వస్తది. అకాలంలో నాగళ్లతో ఎవుసం చేసేటోళ్లం. కరెంట్ సక్కగ ఉండక చాలా తిప్పలు పడ్డాం. కానీ కేసీఆర్ సర్కారు 24 గంటల కరెంట్ సరఫరా చేస్తున్నారు. ఇప్పుడు యాళ్ల పొద్దుగాళ్లనే కరెంట్ పెట్టుకొని ఇంటికి వస్తున్నాం.

– మానాల మల్లయ్య, రైతు, పోతారం, బెజ్జంకి మండలం

## కాంగ్రెసోళ్ల పాలన వద్దు



ఇప్పుడు మంచిగా 24 గంటల కరెంట్ వస్తున్నది. మరి ఇక కాంగ్రెసోళ్ల అవసరం లేదు. ఒకవేళ కాంగ్రెస్ వస్తే 3 గంటల కరెంట్... 10హెచ్‌పీ మోటర్ల ముచ్చట చెప్పుతున్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే మోసపోవుడే. 10హెచ్‌పీ మోటరు పెట్టే ఆర్థిక స్థోమత పేద రైతులకు ఉండదు. ఒక వేళ 10 హెచ్‌పీ మోటరు ఎవరైనా పెడితే బోరు, బావుల్లో నీళ్లు ఉండవు. నోటి కాడి బువ్వను ఎత్తగొట్టే పని చేస్తుంది కాంగ్రెస్. గతంలో కాంగ్రెస్ కరెంట్ సంగతి అందరికీ తెలిసిన విషయమే. విద్యుత్ వచ్చుడు. పోవుడే ఎక్కువ ఉంటుండే. రాత్రి కరెంట్‌తో ఇంకా పరేషాన్. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదు, ఎరువులు దొరకవు, పంట కొనుగోళ్లు ఉండవు. ఆగమాగం, లొల్లి ఉంటది. కాంగ్రెసోళ్ల పాలన వద్దు.

– లావుడ్య రాజు, కేశనాయక్‌తండా, అక్కన్నపేట మండలం